

# సగ్గు రాజయ్య



# పాములోళ్ళు



అదో ఊరు. ఆ ఊరి తరువాత చిన్న మైదానం. ఆ మైదానం పచ్చగడ్డితో నిండి ఉంది. ఆ మైదానంలో గవర్నమెంటు వాళ్లు కట్టించిన పాత ప్రైమరీ స్కూలు. మధ్య ఒక పెద్ద గది. రెండువైపులా వరండాలున్న రెండు గదులు. దసరా సెలవులు కనుక స్కూలు మూసి తాళాలు వేసారు. వరండాలు ఖాళీగా ఉన్నాయి. ఆ వరండాల మీదకు పాములనాడించే సాయిబులు కావిళ్లతో చేరారు. పచ్చగడ్డిలో మూడు పొయ్యిరాళ్లు పెట్టి వంట చేసుకుంటారు. సాయంత్రం నుంచి తెల్లారేదాకా ఆ వరండాలో ఉంటారు. ఓ యాభై అయిదేళ్లు పైబడిన సాయిబు... పేరు గులాం హుసేన్. కొడుకు షేక్ హుసేన్. అతడికి ముప్ఫయి అయిదు సంవత్సరాలుంటాయి. బక్కపలుచగా ఉంటాడు. అతడి కొడుకు వలీ హుసేన్. అతడికి పదమూడు సంవత్సరాలుంటాయి. గులాం హుసేన్ భార్య గోరీబి, ఇరవై ఏళ్ల

కూతురు ఫాతిమా కూడా వాళ్లతో పాటే వరం డాల పైనే ఉంటారు. ముగ్గురు మగాళ్లూ వెళ్లి, దగ్గరి ఊర్లలో ప్రదర్శనలిచ్చి తిరిగి ఆ ప్రైమరీ స్కూలుకే వస్తారు.

"నాలుగు పాములు" వాళ్ల ఆస్తి!

సాయంత్రం అయిదు గంటలవుతోంది. పాములాటల ప్రదర్శనలిచ్చి వచ్చిన మగాళ్లు అలిసిపోయి విశ్రాంతి తీసుకుంటున్నారు. కం పముళ్లతో వంటచేసుకుంటున్నారు ఆడవాళ్లు.

"ఒరేయ్, పాములనాకొడకల్లారా! స్కూలు వరండాల మీద ఎవడుండమన్నాడురా?" లావుగా, నల్లగా ఉన్న ఇరవై అయిదేళ్ల యువకుడు గద్దించాడు. సాము గరిడీలుచేసి బలంగా, భయంకరంగా ఉన్నాడు.

"అయ్యా! మాది కడప జిల్లా, బనగానపల్లి అండీ... ఏదో పాములనాడించుకుంటూ, పొట్ట పోసుకోడానికి వచ్చాము. ఓ రెండు రోజులుండి వెళ్లిపోతాం" అంటూ ముసలాయన సలాం పెట్టాడు.

రెండు రోజులు కాదు – రెండు నిమిషాలు ఉండడానికి వీల్లేదు. ఈ బడి చదువుకోడానికే కానీ, పాములాడించే వాళ్లకోసం కాదు. ఊ... నడవండి ఖాళీ చేయండి... అన్నాడు కోపంగా.

అతడు ఎవరో, ఎందుకు వెళ్లిపొమ్మంటున్నాడో గులాం హుసేన్ బాబాకు అర్థం కాలేదు. ఆయన కొడుకుకు అంతకంటే అర్థంకాలేదు. గోరీబి బ్రతిమిలాడ్డం మొదలుపెట్టింది. గులాం హుసేన్ కూతురు తనను బ్రతిమిలాడుతుందని అనుకున్నాడు. ఆమె అతడి వైపు కూడా చూడకుండా వంట పనిలో నిమగ్నమైపోయింది.

అతడి పేరు ఆంజనేయులు. ఆంజనేయుడి మాదిరిగా పహిల్వాను కావాలనుకుంటాడు. తను చెప్పిందే వేదమంటాడు. కొద్దిగా వ్రాయడం, చదవడం వచ్చు. గ్రహణశక్తి బాగుంది. ఒకరు ఏదైనా విషయం చెబితే వింటాడు. అదే ఇంకో చోట గొప్పగా చెపుతాడు. అక్కడెవరైనా, ఏదైనా చెబితే అది విని ఇంకో చోట తనకే తెలిసినట్టుగా చెపుతాడు. ఇలా అన్ని విషయాలూ తెలిసినవాడిగా అందర్లో చలామణి అవుతున్నాడు. అతడి తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. తల్లి కూలినాలి చేసి ఆంజనేయులుకు అన్నం పెట్టి ఏదీలోటూ లేకుండా అన్నీ సమకూరుస్తుంది. అది అరగక లోకం మీద దాదాగిరి చేస్తుంటాడు. పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటరుగా నమోదవడానికి అతి చేరువలో ఉండి, చాలాసార్లు కోటింగ్ వేసుకున్నాడు.

"ఇక్కణ్ణుంచి తట్టాబుట్టా సర్దుకుని వెళతారా లేదా?"

"అయ్యా... వంటవుతా ఉంది. డబ్బులేక ప్రొద్దుట్నించి ఏమీ తినలేదు. వెళ్లిపోతామయ్యా... వెళ్లిపోతాము" అంటూ గులాం హుసేన్ కాళ్లా వేళ్లాపడ్డాడు.


సరే... ఇప్పటికి వదిలేస్తున్నాను. రేపు వెళ్ళిపోవాలి... అంటూ వెళ్లిపోయాడు.

"సరేనయ్యా, సలామ్"

మరుసటి రోజు ఉదయం పదకొండు గంటలకు ఆటవెయ్యడానికి ఊళ్లోకి వెళ్లారు.

ఊళ్లో ఉన్న కల్లు కాంపౌండులో ఆట మొదలుపెట్టారు. షేక్‌హుసేన్ డోలు వాయిస్తున్నాడు. గులాం హుసేన్ బూర ఊదుతున్నాడు. చిన్నోడు వలీహుసేన్ కావడిలోంచి పాముల బుట్టలు

జిరాఫీ నాలుక పొడవు 21 అంగుళాల వరకూ ఉంటుంది.




బయటపెడుతున్నాడు జనం బాగా పోగయ్యారు. డోలు, బూరా వాయించడం ఆపారు.

"అయ్యలారా, అమ్మలారా" అన్నాడు గులాం హుసేన్.

"కొయ్యలారా, కొమ్మలారా" అంటూ వెంటనే అందుకున్నాడు వలీహుసేన్.

"ఒరేయ్ అలా అంటే తంతా(రా జనం"

"నిన్ను తంతారు. నన్నెందుకు తంతారు?"

"కొయ్యలారా, కొమ్మలారా అంటే జనానికి కోపం వచ్చి తన్నిపోరూ!"

"నేను అనలేదు చెవిటి మాలోకం... నేను అయ్యలారా, అమ్మలారా అన్నాను. నువ్వే కొయ్యలారా కొమ్మలారా అన్నావు. అలా అంటే జనానికి కోపం వచ్చి తన్నిపోరూ!" అంటూ తాతను దబాయించాడు.

ఆ మాటలతో జనానికి హుషారెత్తి చప్పట్లు కొట్టారు.

"వీడు నా మనవడండీ, ఒట్టి గడుగ్గాయి"

తాతను వెక్కిరిస్తూ "నీవు కొబ్బరికాయ"

"ఒక్కమాట వినడు. ఔరా అంటే తౌడా అంటాడు"

మళ్లీ డోలు వాయించాడు షేక్ హుసేన్.

"అబ్బాయ్! నీ పద్ధతేం బాలేదు. పాముల నాడిస్తానని జనాన్ని పోగుజేసుకుని పనికిరాని మాటలు మాట్లాడుతున్నావు" తాతతో అన్నాడు వలీహుస్సేన్.

"నా ఇష్టంరా తాతా, ఆడిపించాలనే వచ్చాను. కానీ ఇప్పుడు ఆడిపించాలనిపించట్లేదు".

"నీకు అట్లాగనిపిస్తోందా? ఇక జనానికేమనిపిస్తుందో తెలుసా. నీ బూరలాక్కుని, లుంగీ ఊడిపోయేదాకా కిందేసి తొక్కాలనిపిస్తది. రెండు కాళ్లూ పోయె నారాయణా అంటూ బనగానపల్లికి రాకుండా ఇక్కడే అడుక్కు తింటావు"

"రేయ్ కు(రకుంకా, నేను పాములనాడించ

డానికే వచ్చాను. తప్పకుండా ఆడిస్తాను. నా ఆట చూసి ఊరికే వెళ్లిపోవద్దు. డబ్బుల్లేని వాళ్లు ఊరికే చూడవచ్చు. డబ్బులున్న వాళ్లు ఊరికే చూసి వెళ్లిపోతే రాత్రికి నాగేంద్రుడు కల్లోకి వస్తాడు"

"అలా కల్లోకివస్తే పజ్జర్‌కు (ఉదయాన్నే) కల్లుపోస్తాము"

"కల్లుకాదురా, నాగేంద్రుడు పాలు తాగుతాడు. ఆ పాలకు డబ్బులిచ్చి పుణ్యం కట్టుకోండి. తల్లులారా, తండ్రులారా దయచూపండి".

"ఆ నీళ్లకు డబ్బులిచ్చి పాపం కట్టుకోండి"

"నీవెక్కడ దొరికావురా, నా ప్రాణానికి! ఆట సాగనివ్వరా!!"

"పాములను చూపించకుండా జనం దగ్గర డబ్బులడిగితే రాళ్లు కొట్టిపోతారు".

"అల్లాగే చూపుతాను. బాబులూ, అందరూ గట్టిగా చప్పట్లు కొట్టండి గట్టిగా".

ఈ లోపల లుంగీ గుడ్డను వలీహుసేన్ కళ్లకు గట్టిగా కడతాడు. గులాం హుసేన్ బూర ఊది "పిల్లగా... కండ్లు కనబడుతున్నయా?"

## నో కామెంట్!



అంటూ అడిగాడు.

"ఏమీ కనిపించడం లేదు"

"నేను ఎవరిని పట్టుకున్నాను?" ఒక మనిషి చేయి పట్టుకుని అడిగాడు.

"ఒక సోగ్గాడు!"

"ఈయన పేరేమిటి?"

"కిషోర్‌బాబు"

"బాబూ నీపేరు కిషోర్‌బాబేనా" అడిగాడు గులాం హుసేన్.

"ఔను".

"ఏ కలర్ షర్ట్ వేసుకున్నాడు?"

"ఆకు పచ్చ కలర్ షర్టు వేసుకున్నాడు"

"ఈయన షర్టు జేబులో ఎన్ని డబ్బులున్నాయి?"

"డబ్బులు లేవు. షోగా తలదువ్వుకోడానికి దువ్వెన, ముఖం తుడుచుకోడానికి పౌడరు అద్దిన తువ్వాలు ఉన్నాయి. కావాలంటే చూడండి".

పచ్చ షర్ట్ అతను తువ్వాలు, దువ్వెన తీసి చూపించాడు.

డబ్బుల్లేవని రెండు చేతులూ ఊపి చూపించాడు.

దాంతో అందరూ చప్పట్లు కొట్టి విజిల్లు వేసారు.

"ఒరే, వల్లీ! నీవు పెండ్లి చేసుకుంటావురా?" తాత మనవణ్ణి అడిగాడు.

ఓ... చేసుకుంటాను... అన్నాడు సంతోషంగా.

"ముసల్ది కావాల్నా, వయసుది కావాల్నా"

"ముసల్దే కావాలి!"

"ఏ ముసల్ది?"

ముందు వరుసలో కూర్చున్న పళ్లు లేని ముసల్దాన్ని చూపించాడు.

"ముసల్దాన్ని ఎందుకు చేసుకుంటావురా? వయసుది ఎందుకు వద్దు?"

"వయసుది ఎగేసి తంతుంది. ముసల్ది నా కడుపుకు ఇంత అన్నం పెడుతుంది"

ఆ మాటతో అందరూ నవ్వి చప్పట్లు చరిచారు.

"సరే... ఆ ముసల్ది ఒప్పుకుంటే దాన్నే పెళ్లి చేస్తానులే" అంటూ కండ్లకు కట్టిన లుంగీని విప్పాడు.

"డోలు వాయించరా... ఒకసారి చప్పట్లు గట్టిగా కొట్టండి బాబులూ!"

దొంతర్లుగా పెట్టిన పాముల బుట్టల్లోంచి ఒక పెద్ద బుట్ట తీసి "అయ్యలారా అమ్మలారా, దీన్ని కింగ్‌కోబరా అంటారు" అంటూ మూత తీసాడు.

"కొయ్యలారా, కొమ్మలారా దీన్ని కుకింగ్ కోపరా అంటారు".

"కోపరా అంటే కొబ్బరిరా! కింగ్ కోబరా... కోబరా... నాగరాజు"

"కోపరా... కోపరా..."

"వీడికి పలకడం చాతకాదు సార్, రాజ నాగు! దీనిని ఎక్కణ్ణించి తెచ్చాను తెలుసా?"

"ఈ ఊరి మురుగు కాల్వలో నుంచి..."

"కాదురా బుడతా... మహారాష్ట్రలోని తార్ గావ్ నుంచి. దీని పొడవెంతరా డింబకా"

"జానెడు"

"ఓరి వెర్రి వెంగళప్పా... ఏడడుగులు. దీని అన్న పొడవెంత ఉండేది? తొమ్మిది అడుగుల పైనే! ఒకరోజు ఆహారం కోసమని బయటికి వచ్చి నరునికంట్లో పడింది. నరునికన్ను చతుర కన్ను! మంచిదికాదు. పాములు పట్టే వస్తాదును మన్మాడ్ నుంచి పిలిపించారు. పాము తిరిగే చోటులో కొన్ని రోజులు మాటువేసాడు. నాగరాజు బయటికి వచ్చాడు ఆహారం కోసం. పాముల వస్తాదు అంతకు ముందెన్నడూ అంత పెద్దనాగుపాముని చూళ్లేదు. సంతోషంతో చంకలు కొట్టుకున్నాడు. వంకీకర్ర తీశాడు. పాము వెంటపడ్డాడు. వేగంగా పరిగెత్తి తలమీద వంకికర్ర పెట్టి నొక్కి తలదొరకపుచ్చుకున్నాడు. బుసకొడుతూ నాగరాజు ఆగ్రహించాడు. తల వస్తాదు చేతిలో ఉంది. తనను కరవకుండా దూరంగా పట్టుకున్నాడు. నాగరాజు వస్తాదు శరీరాన్ని పూర్తిగా చుట్టుకుని, ప్రక్కటెముకలను, ప్రేగులనూ చుట్టి పిప్పి చేస్తున్నాడు. ఆ బాధకు తాళలేక పాములవస్తాదు యా అల్లా... ముఝె బచావ్, బచావ్... ఈ పాపిష్టి పాము నా కడుపును, ఛాతీనీ చుట్టి మెలిపెడుతోంది. పర్‌వర్దిగార్ బచావ్... బచావ్... అంటూ బాధకు తాళలేక గావుకేకలు పెడుతున్నాడు. చుట్టూ అందరూ వింతగా చూస్తూ నోళ్లు వెళ్లబెట్టారు కానీ ఏ ఒకళ్లూ ముందుకు వచ్చి పాముని అతని నుంచి వేరుచేయడం లేదు. అరిచి అరిచి వస్తాదు అలసిపొయ్యాడు. నోట్లోంచి రక్తం వస్తోంది. గుడ్లు తేలేసాడు. అలసిపోయి బలం కోల్పోయిన అతడి చెయ్యి పాము తలను ఎంతో సేపు దూరంగా పట్టుకోలేకపోయింది. బాధతో పట్టు సడలిపోయింది. పిడికిలి విడిపోయింది. నాగుపాము వస్తాదు ముఖం మీద రెండుసార్లు, మెడ మీద ఓసారి కాటేసి, అతడి శరీరాన్ని వదిలి పారిపొయ్యింది. పాము వదిలిన మరుక్షణమే వస్తాదు నేల కొరిగిపొయ్యాడు. రక్తపు నురుగలు కక్కుతూ ప్రాణాలు వదిలాడు..."

"పాముని ఏమీ అనకపోతే అది మనల్ని

ఏమీ అనదు. పగబడితే వదలదు. నాగరాజా నీ దర్శనం ఈ జనాలకు ఇవ్వు" అంటూ బుట్ట మీద మూతతీసాడు. బుట్టలో నుంచి పైకి లేచి, పడగ విప్పింది. దాని పడగను చూసి జనం అవాక్కయ్యారు. అంతకు ముందెవ్వరూ అంత పెద్ద పాముని చూడలేదు.

బూర ఊదడం మొదలుపెట్టాడు. పాము పడగతిప్పక పోయేసరికి భూమిపై అరచేత్తో చరిచి మళ్లీ ఊదడం మొదలుపెట్టాడు. అప్పుడు బూరకు స్పందించి, పడగ అటూ ఇటూ తిప్ప నారంభించింది. అలా ఓ అయిదునిమిషాలు పాముని ఆడించి, తీసి బుట్టలో వేసి మూత పెట్టాడు.

"దీనికంటే పెద్ద నాగరాజు వస్తాదుని కాటేసిన వారానికే నేను పాములనాడించడానికి తారగావ్ వెళ్లాను. అక్కడి ప్రజలు పాముతో వస్తాదు ప్రాణాలు పోగొట్టుకున్న సంగతి చెప్పారు. ఇంకా ఒక పాము తిరుగుతోందని చెప్పారు. నేను కూడా మాటువేసి బూర ఊది ఈ పాముని చాకచక్యంగా పట్టుకున్నాను. ఏయ్ డోలు వాయించరా పెద్దోడా!" అన్నాడు.

"మళ్లీ ఇప్పుడు మీరు చూసిన పాముకి, ముంగిసకూ పోట్లాట పెట్టిస్తాను. ఆ కొట్లాటలో పాముని ముంగిస ముక్కలు ముక్కలుగా కొరికేస్తుంది. పాము చనిపోతుంది. ఇలా ఆట కాక పాముని చంపుకుంటే నాకు ఆడించడానికి పాములు ఉండవు. ఆట లేకపోతే డబ్బులు రావు. డబ్బులు లేకపోతే నాకు తిండి ఉండదు. మళ్లీ పాములను కొనాలంటే డబ్బు కావాలి. ఏ దాత అయినా ఓ నాలుగు వందలు - అయిదు వందలు ఇస్తే ముంగిసకు, పాముకూ పోట్లాటపెడతాను. పాము చనిపోతే ఆ దాతలు ఇచ్చిన డబ్బుతో మళ్లీ పాముని కొనుక్కుంటాను. ఉన్నారా? దాతలు ఎవరైనా..." అంటూ చెయ్యి చాచి జనాన్ని అడగడం ప్రారంభించాడు. ఎవరూ ఒక వంద, ఆఖరికి పది రూపాయలు కూడా ఇవ్వలేదు. దానితో "అరే సంటోడా... ప్రజలు ఎవరూ మాట్లాడ్డం లేదురా. అందువల్ల నా పాముని చంపుకోవడం ఇష్టం లేదురా! అన్నాడు.

"సరే... మరేదైనా ఆటపెట్టు. టీ నీళ్లకు కూడా డబ్బుల్లేవు"

"మనకు వందలు ఇచ్చే దాతలు లేరు. అందువల్ల మరో ఆట వేద్దాం"

"ఏమిటది?"

"మనిషిని పడుకోబెట్టి ఆకాశంలో ఎగిరిస్తాం"

"అంతా ఉట్టిదే... ఒట్టి గ్యాసు!"

"సంటోడా! నీవు అన్న గ్యాసునే మంట మండిస్తాను చూడు. అందరూ ఆశ్చర్యంతో ముక్కున వేలేసుకోవాలి. ఒరేయ్ పెద్దోడా డోలు విడిచి ఇటు రారా. చిన్నోడా నీవు డోలు మీదికి పోరా..."


"డోలు మీదికి నన్ను పంపుతున్నావా? నేను కొడితే పగిలిపోతుంది!"

"అది ఎంత పగులుతుందో నీ వీపు కూడా అంత పగలకొడతాను"

"అమ్మో... కుంటోడికి కోపం వచ్చింది రోయ్. చెప్పిన మాట వినకపోతే నిజంగానే పగులకొడతాడు" అంటూ వలీహుసేన్ జోరుగా వాయించడం మొదలుపెట్టాడు.

* * *

మగాళ్ళు పాములాట వేయడానికి వెళ్లిం




తరువాత రెండు గంటలకు వంట సరుకులు తేవడానికి గోరిబి ఊళ్లోకి వెళ్లింది. స్కూలు వరండా మీద ఆమె కూతురు ఒకతే ఉంది. నిన్నటి అంజనేయులు మళ్లీ వచ్చాడు.

"ఏయ్ పిల్లా ఏంజేస్తున్నావ్, మీ మగాళ్లంతా ఎక్కడికెళ్లారు?" అంటూ అడిగాడు.

"పా... పా... పాములనాడించడానికి"

"అయితే మనం కూడా ఆడుకుందామా?"

"నేనొక్కదాన్నే ఉన్నాను. నన్నేమన్నా అంటే గోల చేసి అందర్నీ పిలుస్తాను" అంది భయంగా.

"నీవు అల్లరి చేసినా, అరిచి గీ పెట్టినా, నిన్ను రక్షించడానికి ఎవరూ రారు. నేనే నీకు దిక్కు" అంటూ ఓ వెకిలి నవ్వు నవ్వాడు.

"మా అమ్మ వంట సరుకులు తేవడానికి ఊళ్లోకెళ్లింది, వచ్చేస్తుంది. నీవు వెళ్లిపో... అరుస్తాను"

"మనిద్దరం ఎంచక్కా ఆడుకుందాం ఈ గదిలో. అంటూ స్కూలు వరండా రూమ్ తాళాన్ని రాయితో పగలగొట్టనారంభించాడు.

"అమ్మా... తొందరగా రామ్మా... నిన్న వచ్చినతను నాతో గొడవ చేస్తున్నాడు" అంటూ తల్లి వెళ్లిన త్రోవవైపు చూస్తూ గట్టిగా అరిచింది. అట్లా చేస్తే అంజనేయులు వెళ్లిపోతాడనే భావన. నిజంగా గోరిబి ఇంకా రావడం లేదు.

అంజనేయులు తాళం పగులకొట్టే పని ఆపి, "ఇదిగో ఎవరొచ్చినా నేనేం భయపడను. నేను రాటు దేలిన మొరటు మనిషిని. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. ఇప్పుడు నీతో ఎందుకు గొడవ? అందరూ వచ్చిం తర్వాతనే వస్తాను" అంటూ విసురుగా వెళ్లిపోయాడు.

గుండె మీద చెయ్యి వేసుకుని ఫాతిమా గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

* * *

గులాం హుసేన్ జోలెలోంచి మనిషి చెయ్యి ఎముక తీసాడు. "పెద్దోడా... క్రింద చాదర్ పరచుకో... పైన ఒకటి కప్పుకుని పడుకో" అన్నాడు. వలీహుసేన్ డోలు ఆపకుండా వాయిస్తున్నాడు.

"అయ్యలారా, అమ్మలారా... వీడు నా కొడుకు. వీడు ఇలాగే అంటే పడుకున్న వాడు పడుకున్నట్లుగానే పైకి లేస్తాడు. అందరూ గట్టిగా చప్పట్లు కొట్టండి. ఎవరైనా చేతులు కట్టుకుంటే వదిలెయ్యండి. చేతులు కట్టుకుంటే పైకి లేవడు. లేచినా క్రింద పడి చనిపోతాడు" అలా అంటూ ఎముకతో పడుకున్న షేక్ హుసేన్ కాళ్ల దగ్గరగా మొక్కుతూ మంత్రాలు చదివాడు.

వలీహుసేన్ డోలు కొట్టడం ఆపుజేసాడు.

"యా అల్లా, రసూలుల్లా, హమారీమక్సత్ పూరిహో"

"యా కాళీ, కల్‌కత్తా వాలీ, ఇన్‌కో ఊపర్ ఉటాలే"

అనగానే పడుకున్న మనిషి పడుకున్నట్టుగానే పన్నెండు అడుగులు పైకి లేచాడు పైన సుమారు రెండు నిమిషాలు ఆగాడు.

"అభి బస్‌హై ఆజావోబేటా నీచే" అనగానే, అలాగే మెల్లిగా భూమి మీదకు వచ్చాడు.


ఆ దృశ్యం చూసి అందరూ గట్టిగా చప్పట్లు కొట్టారు. వలీహుసేన్ గట్టిగా డోలు వాయించాడు. షేక్‌హుసేన్ లేచి అందర్నీ డబ్బులు అడగనారంభించాడు.

"అయ్యలారా, అమ్మలారా ఈ ఆట చూసిన తరువాత డబ్బులు ఇవ్వకుండా పోకూడదు" అంటూ గులాం హుసేన్ అందర్నీ చెయ్యి చాచి అడుగుతున్నాడు.

కొందరు కనికట్టు అన్నారు. మరికొంత మంది మంత్రం అన్నారు. ఎవరికి తోచిన రీతిలో ఆ అద్భుతాన్ని విశ్లేషించారు. గులాం హుసేన్‌కు డబ్బులు బాగా పోగైనాయి. అంతా సర్దుకుని ప్రైమరీ స్కూలు దారి పట్టారు.

ముగ్గురికీ ముఖం, కాళ్లూ చేతులు కడుక్కోడానికి నీళ్లిచ్చింది గోరిబి. కడుక్కున్న తరువాత ముగ్గురూ స్కూలు వరండాలో కూర్చున్నారు. అన్నం, కూర వడ్డించి తెచ్చి ఇచ్చింది ఫాతిమా. భోజనాలు మొదలుపెట్టారు.

"ఒరేయ్ పాముల కొడకల్లారా... పొద్దున్నే వెళ్లిపోతామన్నారు. ఇంకా ఇక్కడే ఉన్నారా? మీరు మర్యాద మాటలకు వినర్రా" అంటూ తింటున్న కంచాల్ని వాళ్ల ముందు నుంచి లాగి పారేసాడు. ఆంజనేయులు గులాం హుసేన్‌ని జుట్టు పట్టుకుని పైకి లేపి చెంప దెబ్బవేసాడు. తింటున్న అన్నం కంచం లాగి, కొట్టేటప్పటికి గులాంహుసేన్‌తో పాటు అందరూ రెచ్చిపోయారు. ఆడవాళ్లు కావడి కర్రలు తీసి ఆంజనేయుల్ని బాదడం మొదలుపెట్టారు. షేక్‌హుసేన్ పరిగెత్తికెళ్లి జోలెలో ఉన్న ఏదో పొడరు తీసుకుని, ఆంజనేయులి జులపాలు పట్టుకుని మెడ మీద గట్టిగా రాసాడు. జనం పోగైనారు. కొట్లాటను విడదీసారు. పోగైన మనుష్యుల్లోంచి ఓ పెద్దాయన "అంజిగా ఎందరితో తన్నులు తిన్నా నీకు బుద్ధి రాలేదురా! చివరికి పాముల వాళ్లతో తింటున్నావన్నమాట! ఎన్నాళ్లు సాగుతుందిరా నీ రౌడీతనం? కనిపించిన ఆడదానికల్లా కన్ను కొడతావు. తండ్రిలేదని మీ అమ్మ గారాబం చేస్తూ కూలీనాలీ చేసి తెచ్చి పెడుతూంటే, కొవ్వెక్కి బలిసి, కండ్లు మూసుకుపోతున్నాయి. ఆ




పాములవాళ్లు వండుకుని తిని పడుకుంటే నీ సొమ్మేం పోతుందిరా? ఈ బడి నీ తాతజాగీరా?" అన్నాడు.

"కాదు పెదనాన్నా... చెత్తా చెదారం చేస్తున్నారు. వండుకోవడానికి ముండ్లకంపతెస్తున్నారు. పిల్లలకు ముండ్లు గుచ్చుకోవా?" మెల్లిగా అన్నాడు.

"నోటితో చెప్పాలిరా! ముసలివాణ్ణి పట్టుకుని కొడుతున్నావు. వాడి ప్రాణంపోతే... ఛో వెధవా!... ఇంటికిపో" అన్నాడు వరసకు పెదనాన్న అయిన పెద్దాయన.

నసుగుతూ వెళ్లిపోయాడు ఆంజనేయులు. జనం కూడా వెళ్లిపోయారు.

గులాంహుసేన్, గోరీబి కలత చెంది, షేక్ హుసేన్‌ని తిట్టనారంభించారు.

"ఆ... నాన్నని అనవసరంగా కొట్టి, తినే కంచాన్ని లాగేస్తే నాకు కోపం వచ్చి అలా చేసాను" అన్నాడు తన తప్పేం లేదన్నట్లుగా.

"ఇక ఇక్కడ ఒక్క నిమిషం కూడా ఉండడానికి వీల్లేదు. తొందరగా నడవండి" అన్నాడు గులాంహుసేన్, అన్నీ సర్దుకుని పదిహేను నిమిషాల్లో కనిపించకుండా పోయారు.

మరుసటి రోజు అందరికీ తెల్లవారింది. కానీ ఆంజనేయులుకి మాత్రం తెల్లవారలేదు. అతను తెల్లవారింది తెలుసుకోలేకపోతున్నాడు. మనుష్యుల్ని గుర్తించలేకపోతున్నాడు. పిచ్చి చేష్టలు చేస్తూ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. ఈ సంగతి క్షణాల మీద ఊరంతా తెలిసిపోయింది. నిన్నటి వరకూ ఆంజనేయుల్ని తిట్టిన వారంతా అసహ్యంతో చీదరించుకుంటూ చూసి వెళుతున్నారు. షేక్ హుసేన్ ఆంజనేయులు తలపై రుద్దిన మందు పౌడరు వల్లే అలా పిచ్చివాడిగా మారాడని ఎవరికీ తెలీదు. పాములవాళ్లతో కొట్లాడి పిచ్చివాడయ్యాడని మాత్రం అందరూ చెప్పుకొంటున్నారు.